ఎస్ఐ సస్పెన్షన్

లంచం ఆరోపణలు రుజువు కావడంతో వేటు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

టెక్కలి పోలీస్‌స్టేషన్‌లో ఎఎస్ఐగా పనిచేస్తున్న టి.నర్సింగరావును ఎస్‌పి కె.వి మహేశ్వరరెడ్డి సస్పెన్షన్ చేశారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు మంగళవారం జారీ చేశారు. టెక్కలిలోని ఓ గ్రానైట్ కంపెనీ నుంచి నర్సింగరావు రూ.ఐదు వేలు లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు రావడంతో విచారణకు ఆదేశించారు. దీనిపై విచారణ చేపట్టిన స్పెషల్ బ్రాంచి అధికారులు డబ్బులు డిమాండ్ చేయడం నిజమేనని తేల్చడంతో శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. పోలీసుశాఖలో అవినీతిని సహించబోమని, ఎవరైనా లంచం అడిగినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి హెచ్చరించారు.

భారీగా గంజాయి పట్టివేత

- 563 కేజీలు స్వాధీనం
- అక్రమ రవాణా చేస్తున్న ముఠా అరెస్టు
- ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో భారీ మొత్తంలో గంజాయి పట్టుబడింది. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా అడవా పంచాయతీ ఉటుక గ్రామం నుంచి గంజాయిని అక్రమ రవాణా చేస్తున్న ముఠాను మెళియాపుట్టి పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 563.920 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను జిల్లా పోలీసుల కార్యాయలంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌పి కె.వి మహేశ్వరరెడ్డి వెల్లడించారు. గంజాయి లోడుతో వాహనం వస్తుందంటూ మెళియాపుట్టి పోలీసులకు గత నెల 24న సమాచారం రావడంతో, జాడుపల్లి వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ఆపకుండా వెళ్లిపోతున్న బోలోరో వాహనాన్ని పోలీసులు వెంబడించారు. దీంతో భయపడిన డ్రైవర్ ఆ వాహనాన్ని వదిలి పరారయ్యాడు. వాహనంలో 16 బస్తాల్లో 563.920 కేజీల గంజాయి ఉన్నట్లు గుర్తించి పోలీసులు కేసు నమోదు చేశారు. వాహనం నంబరు ఆధారంగా డ్రైవర్ ఒడిశా రాష్ట్రం రాయగఢ జిల్లా పిండాగుడికి చెందిన ఆయుబ్ మాజీగా గుర్తించారు. డ్రైవర్ ఇచ్చిన వివరాల ఆధారంగా రెండు వారాల పాటు ప్రత్యేక బృందాలతో గాలించారు. గజపతి జిల్లా శాంతినగర్‌కు చెందిన రంజిత్ బర్ధన్ దీన్ని సమకూర్చినట్లు తెలుసుకుని, వారికి మధ్యవర్తిగా ఉన్న ఒడిశా హోంగార్డు అభిమజ్జిను గుర్తించి మంగళవారం అరెస్టు చేశారు. గజపతి జిల్లా అడవా ప్రాంతం నుంచి పలాస వద్ద జాతీయ రహదారి పైకి చేరి తమిళ నాడుకు చేరవేయాలన్నది వీరి ప్లాన్‌గా విచారణ సందర్భంగా పోలీసులు తెలుసుకున్నారు. వీరి ముగ్గురికీ నేర ప్రవత్తి ఉన్నట్లు గుర్తించారు. గతంలో గంజాయి సాగు చేసినందుకు ఒడిశాలో ఆయుబ్ మాజిపై కేసు నమోదైంది. గంజాయి రవాణను వృత్తిగా చేసుకున్నట్లు గుర్తించారు. రంజిత్ బర్ధన్ గతంలో గంజాయి అక్రమ రవాణాలో పాత్ర ఉన్నట్లు గుర్తించారు. అభిమజ్జి గంజాయి తరలింపునకు సహకారం అందిస్తున్నట్లు తెలుసుకున్నారు. వీరి ఆస్తులను గుర్తించి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి తమిళనాడులో గంజాయి ఎవరికి చేరుతుందో వారిని గుర్తించే పనిలో ఉన్నామని, వారు దొరికిన వెంటనే అరెస్టు చేస్తామని చెప్పారు.

స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు, నిందితులను ప్రవేశపెట్టిన ఎస్‌పి మహేశ్వర రెడ్డి

పోలీసులకు ఎస్‌పి ప్రశంస

గంజాయి అక్రమ రవాణాను అడ్డుకోవడంతో పాటు భారీ మొత్తంలో స్వాధీనం చేసుకున్న పాతపట్నం, మెళియాపుట్టి పోలీసులను ఎస్‌పి కె.వి మహేశ్వరరెడ్డి ప్రశంసించారు. గంజాయిని పట్టుకుని, నిందితులను గుర్తించడంలో చాకచక్యంగా వ్యవహరించిన పాతపట్నం సిఐ వి.రామారావు, మెళియాపుట్టి ఎస్ఐ పి.రమేష్‌బాబు, కానిస్టేబుళ్లు జగన్నాథం, గౌరీశంకర్‌ను అభినందించారు.

పల్లె పండుగ పనుల్లో నిర్లక్ష్యం వద్దు

- ఆపార్ ప్రక్రియను వేగవంతం చేయాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పల్లె పండుగ వారోత్సవాల్లో శంకుస్థాపన చేసిన సిసి రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి జిల్లా, మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు గత నెలలో శంకుస్థాపన చేసిన నిర్మాణ పనుల ప్రగతిలో నిర్లక్ష్యం వహించిన వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎఇలపై చర్యలు తీసుకునే పరిస్థితి రాకుండా మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. సిమెంట్ రోడ్ల నాణ్యత కాల పరిమితి 30 ఏళ్లు ఉంటుందని, నిర్మాణ పనుల నాణ్యతలో రాజీ పడకుండా పనులు చేపట్టాలని చెప్పారు. ఏజెన్సీలు, సిమెంటు, ఇసుక ఇతర మెటీరియల్ ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తానన్నారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఆ నిధులను అవసరమైన వేరే ప్రాంతానికి కేటాయిస్తామన్నారు.

విద్యాశాఖలో ఆపార్ జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని.. తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంఇఒలు ప్రత్యేక దృష్టిపెట్టి త్వరగా పూర్తి చేయాలన్నారు. పుట్టిన తేదీ ధ్రువపత్రాలు లేకపోవడం వల్లే అపార్ ఆలస్యమవుతోందని, అలాంటి వారితో వెంటనే సచివాలయాల్లో సర్టిఫికేట్ల కోసం దరఖాస్తు చేయించాలని సూచించారు. జిల్లాలో 70 వేల మందికి పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాలు అందజేయాల్సి ఉందని, పది రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. సూర్య ఘర్ పథకానికి వచ్చే వారం నాటికి రెండు వేల గృహాలను గుర్తించాలని ఆదేశించారు. కోర్టు కేసులు అధికారుల వైపు నుంచి పెండింగ్‌లో ఉండరాదని స్పష్టం చేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో సురక్షిత మంచినీటి సదుపాయం కల్పించాలన్నారు. జిల్లావ్యాప్తంగా దోమల వ్యాప్తిని అరికట్టేందుకు డిపిఒ, మున్సిపల్ కమిషనర్లు కార్యాచరణ రూపొందించాలన్నారు. గృహ నిర్మాణ ప్రగతి, సాగునీటి సంఘాల ఓటర్ల జాబితా తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి కె.త్రినాథస్వామి, జిల్లా పంచాయతీ అధికారి కె.భారతి సౌజన్య, ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ, జలవనరుల శాఖ ఎస్ఇ పి.సుధాకర్, సిపిఒ ప్రసన్నలక్ష్మి, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, డిఎంహెచ్ఒ బి.మీనాక్షి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కార్పొరేషన్లకు డైరెక్టర్ల నియామకం

జిల్లా నుంచి 11 మందికి అవకాశం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

టిడిపి కూటమి ప్రభుత్వం ఇటీవల రెండో విడత నామినేటెడ్ పదవుల్లో భాగంగా కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించగా, తాజాగా పలు కార్పొరేషన్లకు డైరెక్టర్లను నియమించింది. ఇందుకు సంబంధించిన జాబితాను మంగళవారం విడుదల చేయగా, అందులో జిల్లాకు చెందిన 11 మందికి చోటు దక్కింది. కళింగ కార్పొరేషన్‌లో జిల్లా నుంచి తొమ్మిది మందికి, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్‌లో ఇద్దరికి చోటు లభించింది. కళింగ కార్పొరేషన్ డైరెక్టర్లుగా టిడిపి నుంచి అన్నెపు భువనేశ్వరరావు (ఎచ్చెర్ల), బగాది శేషగిరిరావు (టెక్కలి), బార్ల చిన్నబాబు (ఇచ్ఛాపురం), బావన దుర్యోధన (పలాస), చౌదరి నారాయణమూర్తి (ఎచ్చెర్ల), తమ్మినేని చంద్రశేఖర్ (ఆమదాలవలస)కు చోటు కల్పించారు. బిజెపి నుంచి అట్టాడ రవిబాబ్జీ (శ్రీకాకుళం), జనసేన నుంచి లోళ్ల రాజేష్ (ఇచ్ఛాపురం), పేడాడ రామ్మోహన్ (ఆమదాలవలస)కు చోటు దక్కింది. అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్లుగా టిడిపి నుంచి పలాస నియోజకవర్గానికి చెందిన కె.లక్ష్మణకుమార్, పుచ్చ ఈశ్వరరావును నియమించింది.

ప్రజా సమస్యలపై పోరు

14న ధర్నాలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - ఎచ్చెర్ల, కొత్తూరు, పలాస, రణస్థలం

ప్రజా సమస్యలపై ఈనెల 8 నుంచి 14వ తేదీ వరకు సిపిఎం ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ప్రజా పోరులో భాగంగా ఈనెల 14న చేపట్టనున్న ధర్నాలను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.తేజేశ్వరరావు, నాయకులు సిర్ల ప్రసాద్, ఎన్.గణపతి, సిహెచ్.అమ్మన్నాయుడు పిలుపునిచ్చారు. ఎచ్చెర్ల మండల కేంద్రంలో తేజేశ్వరరావు, కొత్తూరు మండల కేంద్రంలో ప్రసాద్, కాశీబుగ్గలోని సిపిఎం కార్యాలయంలో గణపతి, రణస్థలం సిపిఎం కార్యాలయంలో అమ్మన్నాయుడు ప్రజా పోరు పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ ఇంధన సర్దుబాటు ఛార్జీల ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని, వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు తొలగించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం పలురూపాల్లో మోపిన విద్యుత్, ఇతర భారాలను తగ్గిస్తామని, ఛార్జీలు పెంచబోమని ఎన్నికల్లో హామీ ఇచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం, ఆ హామీకి భిన్నంగా సుమారు రూ.20 వేల కోట్ల భారాన్ని రాష్ట్ర ప్రజలపై మోపుతోందని విమర్శించారు. నిత్యావసర ధరలు సామాన్యులకు అందని విధంగా ఉన్న సమయంలో ప్రజలకు ఉపశమనం కలిగించాల్సింది పోయి, అదనపు భారాలు మోపపడం సరికాదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు డి.బంగార్రాజు టి.రామారావు, ఎన్.ఢిల్లేశ్వరి, జె.భాగ్యలక్ష్మి, హమాలీస్ యూనియన్ నాయకులు ఎం.సురేష్, కె.గోవింద్ కుమార్, జి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తేజేశ్వరరావు

ప్రభుత్వ విప్‌గా అశోక్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ప్రభుత్వ విప్‌గా ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ నియమితులయ్యారు. శాసనసభ, శాసనమండలికి చీఫ్ విప్, విప్ పదవులకు పలువురు సభ్యులను రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం నియమించింది. అందులో భాగంగా ఎమ్మెల్యే అశోక్‌కు శాసనసభలో విప్‌గా స్థానం కల్పించింది. అశోక్ 2014 నుంచి మూడు పర్యాయాలు వరుసగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ప్రస్తుత మంత్రివర్గంలో ఆయనకు చోటు దక్కుతుందని చర్చ సాగినా చివరకు పదవి రాలేదు. కేంద్ర, రాష్ట్ర మంత్రి పదవులు వెలమ సామాజిక తరగతి, ఒకే కుటుంబానికి చెందిన రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడుకు రావడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. కళింగ సామాజిక తరగతి నాయకులు నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమైంది. ఇప్పుడు అశోక్‌కు విప్ పదవిని కట్టబెట్టడం ద్వారా ఆ సామాజిక తరగతిని కొంత సంతోషపరిచినట్లయింది. 2014-19 టిడిపి హయాంలో కూన రవికుమార్‌కు విప్ పదవి వచ్చింది. ఇప్పుడు టిడిపి కూటమి ప్రభుత్వం రెండోసారి జిల్లాకు ఈ పదవి దక్కింది. అశోక్‌కు పదవి లభించడంపై ఆ నియోజకవర్గ టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. మరోవైపు ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు మంత్రి పదవి రాకపోయినా, చీఫ్ విప్ పదవి అయినా వస్తుందని అని ఆయన అనుయాయులు ఇప్పటివరకు ఆశలు పెట్టుకున్నారు. ఇప్పుడు అది కూడా రాకపోవడంతో తీవ్ర నిరాశకు లోనయ్యారు.

చెక్కును అందజేస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

హోంగార్డుల సంక్షేమానికి ప్రాధాన్యం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

హోంగార్డుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో హోంగార్డుల గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పలువురు హోంగార్డులు వారి వ్యక్తిగత, కుటుంబ, ఉద్యోగరీత్యా సమస్యలను ఎస్‌పికి విన్నవించారు. ఆయా సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఎస్‌పి వీలైనంత మేరకు త్వరితగతిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతానని భరోసానిచ్చారు. హోంగార్డుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. పోలీస్ సిబ్బందితో సమానంగా విధులు నిర్వహిస్తున్న హోంగార్డులు వృత్తిపరమైన, వ్యక్తిగత క్రమశిక్షణను పాటిస్తూ పోలీసుశాఖ ప్రతిష్ట మరింత పెరిగేలా పనితీరు ఉండాలన్నారు. హోంగార్డుల సాధకబాధలు తెలుసుకునేందుకే ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని చెప్పారు. వృత్తిపరంగా ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

హోంగార్డు కుటుంబానికి చేయూత

ఇటీవల అనారోగ్యంతో మరణించిన హోంగార్డు పాలక శంబుడు కుటుంబానికి ఆర్థిక చేయూతగా నగదు చెక్కును ఎస్‌పి అందజేశారు. జిల్లాలోని హోంగార్డుల ఒక్కరోజు వేతనాన్ని ఆర్థిక సహాయంగా ఇచ్చిన సుమారు 4.06 లక్షల చెక్కును మృతుని సతీమణి సోములమ్మకు ఇచ్చారు. ఎటువంటి సమస్య, అవసరం ఉన్నా పోలీసు శాఖ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. విధులు నిర్వర్తిస్తూ మరణించినా, రిటైర్మెంట్ పొందిన హోంగార్డుల కుటుంబ సభ్యులకు జిల్లాలో పనిచేస్తున్న తోటి హోంగార్డులందరూ ఆర్థిక చేయుతగా అండగా ఉండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డిఎస్‌పి శేషాద్రి, ఎఒ సిహెచ్.గోపీనాథ్, ఆర్ఐలు హరనాథ్, రవి తదితరులున్నారు.

దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

బిఆర్ఎయులో యువజన్ ఉత్సవ్-2024

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

యువత స్ఫూర్తి దాయకమైన విసూత్న ఆలోచనలు కలిగి దేశాభివృద్ధి, సమైక్యతలో భాగస్వామ్యం కావాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. నెహ్రూ యువ కేంద్రం, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం సంయుక్తంగా యూనివర్శిటీ క్యాంపస్‌లో నిర్వహించిన యువజన ఉత్సవ్-2024ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికసిత్ భారత్-2047లో యువతతో పాటు అన్నివర్గాలు చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కళాశాలలు, విశ్వవిద్యాలయ విద్యార్థులు సరికొత్త ఆలోచనలు, ప్రయోజిత ప్రాజెక్టులతో ముందకొస్తే ఆర్థికసాయం అందించడానికి జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు.

బిఆర్ఎయు వైస్ ఛాన్సలర్ కె.ఆర్ రజని మాట్లాడుతూ డిజిటల్ మార్గాల ద్వారా దేశ సుస్థిర ప్రగతి కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలన్నారు. స్వామి వివేకానంద వంటి మహనీయులు అందించిన స్ఫూర్తితో జాతి పున:నిర్మాణంలో, దేశ బలోపేతంలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలన్నారు. జిల్లా యువజన అధికారి కె.వెంకట ఉజ్వల్ మాట్లాడుతూ యువతలో అంతర్లీనంగా ఉన్న విద్యా, సాంస్కృతిక నైపుణ్యాలను ప్రోత్సహించేందుకు, జాతీయస్థాయిలో జిల్లా ప్రతిభ, విశిష్టతను చాటిచెప్పేందుకు ఈ ఉత్సవ్ దోహదపడుతుందన్నారు.

ఉత్సవ్‌లో భాగంగా సైన్స్ మేళా, పంచప్రాణ్, జానపద నృత్యాలు, చిత్రలేఖనం, పద్యం, ఫొటోగ్రఫీ, ఉపన్యాసం వంటి ఏడు కేటగిరీల్లో విద్యార్థులకు పలురకాల పోటీలు నిర్వహించారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించే పోటీలకు పలువురిని ఎంపిక చేసి నగదు బహుమతులను అందజేశారు. ఉత్సవ్ సందర్భంగా ఏర్పాటు చేసిన పలురకాల ప్రదర్శన, విక్రయ స్టాల్స్‌ను కలెక్టర్ పరిశీలించి ప్రశంసించారు.

కార్యక్రమంలో సమన్వయకర్త, వర్శిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ, యూనివర్శిటీ రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత, సెట్‌శ్రీ సిఇఒ బి.వి ప్రసాదరావు, జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎన్.నారాయణరావు, జిల్లా సమాచార, ప్రజా సంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు, ఎన్ఇఆర్ విద్యాసంస్థల డైరెక్టర్ ఎన్.తేజబాబు, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

వన్యప్రాణుల అక్రమ రవాణా

ముగ్గురు అంతర్రాష్ట్ర స్మగ్లర్ల అరెస్టు

ప్రజాశక్తి - పలాస

ఒడిశా నుంచి కర్నాటకు ఆఫ్రికన్ జాతికి చెందిన 21 వన్యప్రాణులను కారులో అక్రమంగా తరలిస్తున్న అంతర్రాష్ట్ర స్మగ్లర్ల ముఠాను అటవీశాఖ అధికారులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను కాశీబుగ్గ అటవీశాఖ రేంజర్ ఎ.ఎం.కె నాయుడు విలేకరులకు మంగళవారం తెలిపారు. ఒడిశాకు చెందిన సయ్యద్ ముయాఖతల్లా, విజయ్‌కుమార్, అహ్మద్ ఖాన్ ఆఫ్రికన్ జాతికి చెందిన 17 కొండచిలువ పిల్లలు, పెద్ద తాబేలు ఒకటి, చిన్న తాబేళ్లు రెండు, అదే జాతికి చెందిన అడవిపిల్లిని మెత్తం 21 వన్యప్రాణులను ఒడిశా నుంచి కర్నాటకకు కారులో తరలిస్తున్నారు. ఇచ్ఛాపురం చెక్‌పోస్టు వద్ద అటవీశాఖ అధికారులు తనిఖీలు చేపట్టగా, కారులో వన్యప్రాణులు ఉన్నాయి. కారును సీజ్ చేసిన అధికారులు, అందులో ఉన్న వన్యప్రాణులను స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వన్యప్రాణుల అక్రమ రవాణా చట్టం కింద కేసు నమోదు చేసి, నిందితులను ఇచ్ఛాపురం కోర్టులో హాజరుపరిచారు. వన్యప్రాణులను విశాఖ జూకు తరలించారు.

స్వాధీనం చేసుకున వన్యప్రాణులు

ఆర్‌ఒబి భూసేకరణ వేగవంతం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పలాస రైల్వే ఓవర్ బ్రిడ్జికి సంబంధించిన భూసేకరణను వేగవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. మార్చి నెలాఖరుకు పనులు పూర్తి చేయాలన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి సంబంధిత అధికారులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జమ్మూ నుంచి పాతపట్నం ఎన్‌హెచ్-326ఎ రోడ్డు బైపాస్ పనులకు సంబంధించిన పనులను బుధవారం నుంచి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. పలాస ఆర్‌ఒబికి సంబంధించి కొన్ని సమస్యలు ఉన్నాయని రైల్వే అధికారులు తెలుపగా, సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామన్నారు. సమావేశంలో ఆర్‌డిఒ సాయి ప్రత్యూష, ట్రాన్స్‌కో ఎస్ఇ కృష్ణమూర్తి, ఆర్అండ్‌బి ఎస్ఇ జాన్ సుధాకర్, ఎస్‌డిసి యూనిట్ - 4 లావణ్య, మార్కెటింగ్ ఎడి బి.రవికుమార్, పలాస ఆర్‌డిఒ వెంకటేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

నేడు తెప్పోత్సవం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

క్షీరాబ్ధి ద్వాదశిని పురస్కరించుకుని అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో బుధవారం నిర్వహించే తెప్పోత్సవానికి ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అరసవల్లిలో రథసప్తమి తర్వాత నిర్వహించే అతి పెద్ద ఉత్సవం ఇదే. ఈ ఉత్సవానికి తెప్పోత్సవం, హంస నావికోత్సవం, తెప్ప తిరునాళ్ళ అని వేర్వేరు పేర్లతో పిలుస్తారు. ఏటా కార్తీక మాసంలో వచ్చే క్షీరాబ్ధి ద్వాదశి రోజున ఈవేడుకను నిర్వహిస్తారు. ఇంద్రపుష్కరిణిలో హంస నావికోత్సవానికి మంగళవారం ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బుధవారం సాయంత్రం 4.15 నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు ఈ వేడుకలు నిర్వహించనున్నారు. ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వహణాధికారి భద్రాజీ, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ పరిశీలించారు.

పటిష్ట బందోబస్తు

అరసవల్లి సూర్యనారాయణ స్వామి, శ్రీకూర్మంలోని కూర్మనాథ ఆలయాల్లో తెప్పోత్సవం ప్రశాంతంగా నిర్వహించేందుకు సమన్వయంతో పనిచేయాలని డిఎస్‌పి సిహెచ్.వివేకానంద అన్నారు. తెప్పోత్సవానికి చేపట్టాల్సిన జాగ్రత్త చర్యలపై పోలీసు, ఎండోమెంట్, రెవెన్యూ, అగ్నిమాపక, మత్స్యశాఖల అధికారులతో స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటిష్ట బందోబస్తు కేటాయిస్తున్నామని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సమన్వయంతో పనిచేయాలని కోరారు. యాత్రికులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి, సజావుగా దర్శనం కలిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైన బోట్లు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సమావేశంలో అరసవల్లి ఆలయ ఇఒ భద్రాజీ, రూరల్ సిఐ పైడిపు నాయడు, గార ఎస్ఐ జనార్ధన్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



మహారాజ శ్రీ సోంపేట సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
SOP 1/2024

Between:-
1. గౌరకల భారతి
2. శివంగి గీత
3. గౌరకల సురేష్
4. గౌరకల ఉదయ్ కిరణ్ ....పిటిషనర్లు
And:- Nil .....రెస్పాండెంట్లు

పైన తెలిపిన SOP:1/2024 గల పిటిషన్, పైన తెలిపిన 1 నుండి 4 పిటిషనర్లు, కాలం చేసిన గౌరకల చిరొంజీ గారి వారసులని నిర్ణయించి సక్సెషన్ సర్టిఫికేట్ ఇప్పించగోరి పిటిషనర్లు పైన తెలిపిన కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా సదరు పిటిషన్ **తే 25-11-2024 దీకి వాయిదా వేసియున్నారు.** మరియు పబ్లిక్ కు తెలియజేయుట కొరకు, కోర్టు వారి ఆర్డరు ప్రకారం ఈ పేపర్ ప్రకటన ద్వారా తెలియచేయుచున్నాము.

కాబట్టి సదరు పిటిషన్ పై ఎవరికయినా ఎటువంటి అక్షేపణలు ఉన్న యెడల పైన తెలిపిన కోర్టు వారి ఎదుట **తే 25-11-2024 దీన ఉ. 10:30 గంటలకు** స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరయి మీ యొక్క ఆక్షేపణలు తెలియచేసుకొనవలెను. లేని యెడల కోర్టు వారు సదరు పిటిషన్ పై తీర్మానించెదరు.

G. YOGESH, B.Com., LLB
Advocate & Notary,
Sompeta,
Srikakulam Dist, Ph: 9849404543.

SRIKAKULAM MUNICIPAL CORPORATION

నోటిఫికేషన్-1: శ్రీకాకుళం నగరపాలక సంస్థ స్వచ్ఛ సర్వేక్షన్ 2024 పోటీల్లో మెరుగైన ర్యాంకు సాదన కోసం శ్రీకాకుళం నగరాన్ని ఓ.డి.ఎఫ్ ప్లస్ (ODF+)గా తీర్చిదిద్దుటకు మరియు గార్బేజ్ ఫ్రీ సిటీ(GFC)గా తీర్చిదిద్దుటకు క్రింది చర్యలు చేపట్టడమైనది.
1) నగరాన్ని పూర్తిస్థాయిలో బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత నగరంగా ఉంచుట.
2) బహిరంగ మల, మూత్ర విసర్జన చేసిన యెడల వారికీ ఈ క్రింది విధంగా రుసుములు విధించుట.

బహిరంగ మూత్ర విసర్జనకు రూ.100 | బహిరంగ మల విసర్జనకు రూ.500

3) పట్టణ ప్రజలు పూర్తిస్థాయిలో తడి చెత్త, పొడి చెత్తలను నివాసాల వద్దనే విభజించి నగరపాలక సంస్థ పారిశుద్ధ్య సిబ్బందికి అందజేయుట.

నోటిఫికేషన్-2: భారత ప్రభుత్వ పట్టణ అభివృద్ధి మంత్రిత్వ శాఖ అభివృద్ధి చేసిన 15వ ఆర్థిక కమిషన్, పట్టణ ప్రాంత సర్వీస్ లెవెల్ బెంచ్ మార్కింగ్ కు సంబంధించిన పట్టణ ప్రాంత సేవలైన (1) నీటి సరఫరా (2) మురుగునీరు & పారిశుద్ధ్యం (3) ఘన వ్యర్థాల నిర్వహణ మరియు వరద నీటి నిర్వహణకు గాను 2023-24 సంవత్సరమునకు ప్రస్తుత సేవా కనీస స్థాయిలు మరియు 2024-25 సంవత్సరమునకు సంబంధించిన కనీస సేవా స్థాయిలు ప్రచురించడమైనది.

ఇతర వివరముల కొరకు ఈ ఆఫీస్ పని చేయు వేళలలో సంప్రదించగలరు.
ఫోన్. నెం: 9849906972, 9849905787

Sd/- Commissioner.,
Srikakulam Municipal corporation

ట్రోఫీని అందజేస్తున్న ఎస్పి మహేశ్వర రెడ్డి

విద్యార్థి దశ కీలకం

ఎస్పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

బాల్యం, విద్యార్థి దశ ప్రతి ఒక్కరికీ ఎంతో కీలకమని, ఆ సమయంలో మంచి మార్గాన్ని ఎంచుకుని ఎదుగుదలకు బాటలు వేసుకోవాలని ఎస్పి కె.వి.మహేశ్వర రెడ్డి పేర్కొన్నారు. క్రీడలతో పాటు చదువుపై యువత దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లా ఎస్పి కార్యాలయంలో బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులను మంగళవారం అభినందించారు. ఈ నెల 8న నంద్యాలలో మూడు రోజుల పాటు శాప్, బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీలో శ్రీకాకుళం జిల్లా బాలికల విభాగంలో తృతీయ స్థానాన్ని దక్కించుకుంది. విజయాన్ని అందుకున్న వారు ఎస్పిని మర్యాద పూర్వకంగా కలిశారు. క్రీడాకారుల్లో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన హోంగార్డు రాజేశ్వరరావు కుమార్తె ఎస్.నందిని, ఎం.గాయత్రిలను అభినందించారు. జాతీయ స్థాయిలో మెరుగైన ప్రదర్శన చూపి క్రీడల్లో విజయం సాధించాలన్నారు. కార్యక్రమంలో డిఎస్పి శేషాద్రి, జిల్లా బాల్ బ్యాడ్మింటన్ ఫిజికల్ డైరెక్టర్ మధు పాల్గొన్నారు.

పతకాలను అందుకుంటున్న క్రీడాకారులు

కర్రసాములో జిల్లాకు పతకాల పంట

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఈ నెల 10న గుంటూరులో నిర్వహించిన కర్రసాము సౌత్ జోన్ పోటీల్లో జిల్లాకు చెందిన దేవస్ ఇండియన్ ట్రెడిషనల్ మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులు ఓవరాల్ ఛాంపియన్ షిప్‌లో ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. విజేతలకు మంగళవారం నగరంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ కో-ఆర్డినేటర్ శాసపు జోగినాయుడు అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కర్ర సాము మన దేశానికి చెందిన ప్రాచీన యుద్ధ కళ అని పేర్కొన్నారు. యువతీ యువకులు ఆత్మరక్షణ కోసం కర్ర సాము నేర్చుకునే వారని, ఆత్మరక్షణలో భాగంగా నేర్చుకున్న ఈ క్రీడ ప్రస్తుతం కళా రూపంగా మారుతుందన్నారు. ప్రాచీన సంప్రదాయ యుద్ధకళకు పూర్వ వైభవం తీసుకొస్తున్న నిర్వహకులను అభినందించారు. కర్రసాము విజేతలకు మెడల్స్, ప్రశంసాపత్రాలు స్టార్ వాకర్స్‌క్లబ్ ప్రతినిధులు గోలీ ఉమామహేశ్వరరావు, గోలీ సంతోష్, ఎం.మల్లిబాబుల చేతులమీదుగా అందజేశారు. కోచ్ బి.హర్షవర్ధన్, సహాయ కోచ్ చిన్న యాదవ్‌లను అభినందించారు.

క్రీడా పోటీలు ప్రారంభం

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం రోటరీక్లబ్ ఆధ్వర్యాన స్థానిక సూరంగి రాజా క్రీడా మైదానంలో న్యూ జనరేషన్ క్రీడలు మంగళవారం ప్రారంభించారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు ఎం.రాజకుమార్, కార్యదర్శి పైడిశెట్టి దినేష్ పర్యవేక్షణలో లాంఛనంగా ప్రారంభించారు. మొదటి రోజు 100, 200, 400, 800 రన్నింగ్, అలాగే లాంగ్‌జంప్, హైజంప్, షార్ట్‌పుట్ పోటీలు నిర్వహించారు. ఈ నెల 24 వరకు వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ ప్రతినిధులు, ప్రాజెక్టు చైర్మన్ కె.రామారావు, నవీన్‌కుమార్, గోపీచౌదరి, వి.కె.ప్రసాద్, రోహిత్, మధు, షణ్ముఖ, పాక దాసు, వల్లంపాటి సురేష్, జోగారావు పాల్గొన్నారు.

పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

పంచాయతీల అభివృద్ధిపై సమగ్ర ప్రణాళిక

ప్రజాశక్తి- పోలాకి

గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై అవగాహన ఉండాలని ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి నుంచి గ్రామస్థాయి అధికారులతో పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై మంగళవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధిపై గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి చర్చించాలని సూచించారు. ఒక్కో పంచాయతీలో నాలుగు గ్రామసభలు నిర్వహించాలన్నారు. జనవరి 31 నాటికి పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జి.రవికుమార్, విశ్రాంతి ఎంపిడిఒ రాధాకృష్ణ, సూపరింటెండెంట్ సూర్యప్రకాష్, ఇఒపిఆర్‌డి పద్మావతి, ఎఇలు శ్రీనివాసరావు, మోహనరావు, ఎపిఎం జి.రాజారావు పాల్గొన్నారు.

కవిటి: పంచాయతీ అభివృద్ధిపై సమగ్ర ప్రణాళిక రూపొందించుకోవాలని ఎంపిడిఒ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక జిపిడిపి శిక్షణా తరగతులు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల అధికారులు, కార్యదర్శులు సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రాహి, జెఇ ప్రవీణ్‌కుమార్, ఎపిఎం గోవిందరావు, ఎపిఒ మోహనరావు పాల్గొన్నారు.

పలాస : పంచాయతీలను అభివృద్ధి చేసేందుకు ముందస్తు

పోలాకి : మాట్లాడుతున్న భైరాగినాయుడు

ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఎంపిడిఒ వసంతకుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణా తరగతులు నిర్వహించారు.

మెళియాపుట్టి : పంచాయతీల అభివృద్ధిపై స్థానిక ఎన్‌ఆర్‌ఇజిఎస్ కార్యాలయంలో డిఎల్‌పిఒ గోపీబాల శిక్షణా తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నరసింహ ప్రసాద్‌పండా, పంచాయతీరాజ్ ఎఇ ఆనందరావు, కార్యదర్శులు చింతల అప్పారావు, శివాజీ, ఢిల్లీరావు, మోహనరావు, నాగమణి, పి.యుగంధర్ పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణా తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సిహెచ్.లక్ష్మీబాయ్, ఎంపిపి ఆట్ల సరోజనమ్మ పాల్గొన్నారు.

రణస్థలం: పంచాయతీ కనీస పరిపాలన అభివృద్ధిపై మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఐ.వి.రమణ, ఎంపిడిఒ ఎం.ఈశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, జడ్‌పిటిసి టొంపల సీతారాముడు పాల్గొన్నారు.

పాతపట్నం : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ చంద్రకుమారి కార్యదర్శులకు పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణా తరగతులను నిర్వహించారు.

పొందూరు: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ మీసాల మన్మథరావు పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణా తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి పి.సింహాచలం పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: ప్రజలకు ఉపయోగపడేలా పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయాలని టెక్కలి డివిజనల్ అభివృద్ధి అధికారి అలివేలు మంగమ్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వెలుగు విఒఎలకు ఎంపిడిఒ కుప్పిలి ఫణీంద్రకుమార్ శిక్షణా తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఆనందరావు, ఉపాధి హామీ ఎపిఒ జి.హరిప్రసాద్, మాస్టర్ ట్రైనర్ బాలకృష్ణ, నరేష్ పాల్గొన్నారు.

మందస : మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై ఎంపిడిఒ పైల సూర్యనారాయణ శిక్షణా తరగతులను నిర్వహించారు. కార్యక్రమంలో ఎఒ రుశ్వేశ్వరరావు, కార్యదర్శులు, విఒఎలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులు సిఐటియులో చేరిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎఐటియుసి అనుబంధ యూనియన్‌లో ఉన్న మున్సిపల్ కార్మికులు, నాయకులు సిఐటియు అనుబంధ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్‌లో చేరారు. నగరంలోని రివర్ వ్యూపార్కు వద్ద మంగళవారం నిర్వహించిన సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, నగర కన్వీనర్ ఆర్.ప్రకాష్, మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం, జిల్లా అధ్యక్షులు అరుగుల గణేష్ సమక్షంలో వీరంతా యూనియన్ సభ్యులుగా చేరారు. వారిని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఐటియు కార్మికుల హక్కులకు, సమస్యలు పరిష్కారానికి సమరశీల పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. కార్మికవర్గ ఐక్యత కోసం కృషి చేస్తుందన్నారు. సిఐటియు నాయకత్వం చేసిన పోరాటాలు ఫలితంగా మున్సిపల్ కార్మికులు అనేక హక్కులు సాధించుకున్నారని గుర్తు చేశారు. పెండింగ్

సిఐటియులో చేరిన మున్సిపల్ కార్మికులు

సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ హామీల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. సిఐటియులో చేరిన వారిలో జలగడుగుల ప్రసాద్, బొమ్మాళి కూర్మారావు, పొట్నూరు గోపిబాబు, నల్లపల్లి జ్యోతి, భాస్కరరావు, తుపాకుల శ్రీను, కొవ్వాడ కృష్ణకుమారి, రత్నాల రాజశేఖర్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు గురుస్వామి, శంకర్, మోహన్, యుగంధర్ పాల్గొన్నారు.

బడ్జెట్‌లో జిల్లాకు మొండిచేయి

డిసిసి అధ్యక్షులు ఎ.కృష్ణారావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కృష్ణారావు

రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జిల్లా ప్రజలకు మొండిచేయి చూపిందని డిసిసి అధ్యక్షులు అంబటి కృష్ణారావు ఒక ప్రకటనలో విమర్శించారు. అన్ని రంగాలకు అరకొరక నిధులను కేటాయించి అభివృద్ధికి కావాల్సిన నిధులను కేటాయించినట్టు గొప్పలు చెప్పుకుంటున్నారని వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను ప్రకటించి ఎప్పటికీ ప్రభుత్వం ఐదు నెలలైనా అమలు చేయలేదని విమర్శించారు. రాష్ట్ర విభజన చట్టంలోని వెనుకపడిన ప్రాంతాల అభివృద్ధికి ప్యాకేజీ, రైల్వే జోన్, గిరిజన యూనివర్సిటీలు, విద్యాసంస్థల నిర్మాణం కేంద్రం చేస్తున్న జాప్యం గురించి అడిగే ధైర్యం లేదన్నారు.

తమ్మినేనిని కలిసిన 'చింతాడ'

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంను ఆయన స్వగృహంలో నూతనంగా నియమితులైన నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త చింతాడ రవికుమార్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో వైసిపికి పూర్వ వైభవం తీసుకురావడానికి విలువైన సూచనలు అందించి సహకరించాలని సీతారాంను చింతాడ కోరారు. వైసిపి అధినేత వైఎస్.జగన్మోహన్‌రెడ్డి చింతాడ రవికుమార్‌ను నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించడంపై నాలుగు మండలాలతో పాటు మున్సిపాలిటీ పరిధిలోని వైసిపి నాయకులు సమాలోచనలు చేస్తున్నట్లు తెలిసింది.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న రవికుమార్

మేధస్సు పెంచేందుకు క్విజ్ పోటీలు దోహదం

మాట్లాడుతున్న డిఇఒ తిరుమల చైతన్య

ప్రజాశక్తి- నందిగాం

డిఇఒ తిరుమల చైతన్య

విద్యార్థుల మేధస్సు పెంచేందుకు క్విజ్ పోటీలు దోదహపడతాయని డిఇఒ తిరుమల చైతన్య అన్నారు. మండలంలోని బడగం ప్రాథమిక ఉన్నత పాఠశాలలో మంగళవారం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాస్థాయి క్విజ్ పోటీలను నిర్వహించారు. ముందుగా పాఠశాల ఆవరణలో కదంబ మొక్కను నాటారు. అలాగే సరస్వతీదేవి విగ్రహానికి పూలమాల అలంకరించారు. ఈ సందర్భంగా స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించి సూపర్ టెన్ ఎంపిక చేశారు. ఆరు రౌండ్ల క్విజ్ పోటీలోమొదటి బహుమతి రూ.5 వేలు నగదు, ట్రోఫీ మందస మండలానికి చెందిన ఎంపియుపి స్కూల్ రట్టి టీమ్ గెలుచుకుంది. రూ.3 వేలు నగదు, ట్రోఫీ గెలుచుకుని రెండో స్థానంలో సంతబొమ్మాళి ప్రభుత్వ ఉన్నత పాఠశాల నిలిచింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కణితివూరు రూ.2 వేలు నగదు, ట్రోఫీతో మూడో స్థానం సాధించింది. ఈ బహుమతులు, నగదును దాత పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో వైద్యులు కూన పవన్‌కుమార్ అందించారు. కార్యక్రమంలో ఎంఇఒ చిన్నారావు, బడగాం గ్రామ సర్పంచ్ కూన శాంతారావు, నందిగాం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరిబాబు, స్థానిక ప్రధానోపాధ్యాయులు కుమారస్వామి, బడగాం ఉపాధ్యాయులు కంచరాన భుజంగరావు, శశికాంత్, మాలిబాబు, వెంకటరావు, హిమంతరావు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న శ్రీకూర్మం వాసులు

సిబ్బందిని నియమించాలని వినతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గార మండలం శ్రీకూర్మం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని, దీనివల్ల రోగులకు సరైన వైద్యసేవలు అందించడానికి ఉన్న వైద్య సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ ఎం.ప్రభాకర్ కోరారు. ఈ మేరకు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డిఎంహెచ్‌ఒ డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షిని మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఆస్పత్రిలో రెండేళ్లుగా స్టాఫ్‌నర్సు పోస్టు ఖాళీగా ఉందన్నారు. అలాగే రాత్రి పూట ఆస్పత్రిలో నైట్ వాచ్‌మెన్ లేక అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి మాజీ సభ్యులు గోర సురేష్, వి.ఎస్.గిరి, ఆర్.శంకరరావు పాల్గొన్నారు.

చట్టవిరుద్ధ కార్యకలాపాలపై చర్యలు

కాశీబుగ్గ డిఎస్‌పి వెంకట అప్పారావు

ప్రజాశక్తి- పలాస

వి.వి అప్పారావు, డిఎస్‌పి

చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవని కాశీబుగ్గ డిఎస్‌పి వి.వెంకట అప్పారావు హెచ్చరించారు. కాశీబుగ్గ డిఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం మంగళవారం మెదటి సారిగా విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ నూతన పాలసీని ఆధారంగా అనవసరంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడితే కేసులు తప్పవని హెచ్చరించారు. విచ్చలవిడిగా మద్యం సేవించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. పశువులు అక్రమ రవాణా, ఈవ్ టీచింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లో డ్యాన్స్ బేబీ డ్యాన్స్ పేరుతో రికార్డింగ్ డ్యాన్స్‌లు నిర్వహించినా, కోడి, గొర్రె పందాలు, పేకాటలు నిర్వహిస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అన్ని దుకాణాల వద్ద సిసి కెమోరాలను ఏర్పాటు చేయించి వాటిపై నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సమస్య లేకుండా చూస్తామన్నారు. రోడ్డుకు అడ్డదిడ్డంగా తోపుడు బళ్లు పెడితే వారిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. ఆటోలు విచ్చలవిడిగా నడపడాన్ని అరికట్టి వారికి ప్రత్యేక డ్రస్ కోడ్ ఏర్పాటు చేస్తామన్నారు. పిక్నిక్ స్పాట్‌పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రజలంతా పోలీసులకు సహకరించి ఫ్రెండ్లీ పోలీస్ భావనతో మెలిగేందుకు చర్యలు చేపడతామన్నారు. సమావేశంలో కాశీబుగ్గ సిఐ డి.మోహనరావు, కాశీబుగ్గ రూరల్ సిఐ తిరుపతి పాల్గొన్నారు. అనంతరం మాజీ మంత్రి గౌతు శివాజీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. శివాజీతో పాటు టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి విఠల్ రావు ఉన్నారు.

శంకుస్థాపన చేస్తున్న శ్రీరంగనాయకులు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని గోకర్ణపల్లిలో టిడిపి జిల్లా కార్యదర్శి సీపాన శ్రీరంగనాయకులు ఆధ్వర్యాన మంగళవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ప్రధాన కూడలిలో రచ్చబండ నిర్మాణంతో పాటు ఎస్‌సి కాలనీ నుంచి రంగనాథపేటకు వెళ్లే రహదారి వరకూ, అలాగే పంటకోనేరు చెరువు చుట్టూ గ్రావెల్ రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ అభివృద్ధి పనులను ఎంపిపి నిధులతో చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ సీపాన వెంకట చక్రధర్‌నాయుడు, గురుగుబెల్లి రామారావు, సంపతిరావు ఉమామహేశ్వరరావు, గురుగుబెల్లి దాలినాయుడు, కార్యదర్శి వెంకటరామరాజీవ్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న విజయభాస్కర్

జెఇఇ మెయిన్స్‌పై అవగాహన

నరసన్నపేట : పాత ప్రశ్నపత్రాలను చదవడం వల్ల వేగం, కచ్చితత్వం పెరుగుతుందని విషయ నిపుణులు బి.విజయభాస్కర్ అన్నారు. స్థానిక పద్మావతి జూనియర్ కళాశాలలో జెఇఇ మెయిన్స్‌పై మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మెయిన్స్ పరీక్షలకు చదివే వారికి టైం మేనేజ్‌మెంట్, రివిజన్ ఎంతో కీలకమని సూచించారు. ఎన్‌సిఇఆర్‌టి పుస్తకాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలన్నారు. ఈ సమయంలో ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సిచ్.దుర్గాప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అన్నదానంలో పాల్గొన్న ప్రజలు

కొత్తలక్కుపురంలో అన్నదానం

బూర్జ: మండలంలో పాలవలస పంచాయతీ కొత్తలక్కుపురంలో వెంకట రమ సత్యనారాయణ స్వామి ఆలయ అర్చకులు రంప శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యాన కార్తీక మాసం ఏకాదశి సందర్భంగా మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. లక్కుపురం, కొత్తలక్కుపురం, పాలవలస, తుడ్డలి, మర్రిపాడు, పనుగుపర్త, వైపర్త, రామన్నపేట, కొండపేట, పెద్దపేట తదితర గ్రామాలకు చెందిన నాలుగు వేల మంది యాత్రికులు పాల్గొన్నారు. అలాగే 24 గంటల పాటు తొమ్మిది భజన బృందాలతో భక్తి కీర్తనలను నిర్వహించారు.

'ఆఫ్‌షోర్'కు నిధుల కేటాయింపు

ఎమ్మెల్యే గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

మండలంలోని రేగులపాడు వద్ద నిర్మిస్తున్న ఆఫ్‌షోర్ రిజర్వాయరు నిర్మాణానికి మళ్లీ వడివడిగా అడుగులు పడుతున్నాయని, ఇందుకు సంబంధించి కూటమి ప్రభుత్వం తొలివిడతగా రూ.35 కోట్లు మంజూరు చేయడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే గౌతు శిరీష హర్షం వ్యక్తం చేశారు. మంగళగిరిలో నిర్వహించిన అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొని అనంతరం ఫోన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఆఫ్‌షోర్ నిర్మాణ పనులపై గత ఐదేళ్లుగా కాకమ్మ కబుర్లు చెబుతూ అప్పటి వైసిపి ప్రభుత్వం కాలయాపన చేసిందని

గౌతు శిరీష, ఎమ్మెల్యే

విమర్శించారు. 2014 నుంచి 2019 వరకు ఆఫ్‌షోర్‌కు వందలాది కోట్ల రూపాయల నిధులను అప్పటి టిడిపి ప్రభుత్వం కేటాయించినట్లు గుర్తు చేశారు. వైసిపి వచ్చిన తర్వాత ఆఫ్‌షోర్ నిర్మాణానికి తట్టెడు మట్టి వేయలేదని ఆక్షేపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ఆ ప్రాజెక్టుకు మళ్లీ జీవం పోశారని కొనియాడారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

'కుప్పిలి' కవితకు జాతీయ బహుమతి

ఆమదాలవలస : పట్టణానికి చెందిన కవి, రచయిత కుప్పిలి వెంకటరాజారావుకు కవితల పోటీల్లో మరో జాతీయ బహుమతి లభించింది. కర్ణాటక తెలుగు రచయితల సమాఖ్య, బెంగళూరు నగరంలో అక్టోబరు నెలలో ఆన్‌లైన్‌లో నిర్వహిం చిన జాతీయ కవితల పోటీల్లో కె.వి.రాజారావు రచించిన 'స్వార్థ శకటం' కవిత ఉత్తమ కవితగా ఎంపికైనట్లు సమాఖ్య చైర్మన్ మాల్యాద్రి బొగ్గవరపు, ప్రధాన కార్యదర్శి సింగూరు నరేంద్రబాబు సమాచారం పంపారు. బహుమతి కింద రూ.750, ప్రశంసా పత్రం పంపినట్లు రాజారావు తెలిపారు. రెండు రాష్ట్రాల నుంచి వచ్చిన కవితల్లో 24 మందిని ఎంపిక చేయగా, టాప్ కవులు నలుగురిలో కుప్పిలి వెంకట రాజారావు ఒకరు కావడం విశేషం. ఇప్పటి వరకు రాజారావు సాధించిన బహుమతుల్లో ఇది డెబ్బై రెండోది కావడం గమనార్హం.

యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

మాట్లాడుతున్న బాబూరావు

ప్రజాశక్తి- కంచిలి

యుటిఎఫ్ మండల శాఖ నూతన కార్యవర్గ ఎన్నికను స్థానిక సిఐటియు కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎల్.బాబూరావు, జిల్లా కార్యదర్శి మురళీప్రకాశ్ ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. సంఘ గౌరవ అధ్యక్షుడిగా త్రిలోచనా ప్రధాన్, అధ్యక్షుడిగా మురళీనాయక్, ప్రధాన కార్యదర్శిగా నల్లాన రవి, సహధ్యక్షులుగా జాకబ్ లిమ్మ, కె.అనురాధ, కోశాధికారిగా టి.త్రినాథ్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా జె.భగవతిరావు సిపిఎస్ కన్వీనర్‌గా పుల్లు బెహరా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితోపాటు జిల్లా కౌన్సిలర్లుగా ఏడుగురుని, కార్యవర్గ సభ్యులుగా తొమ్మిది మందిని, మహిళా కమిటీ సభ్యులుగా ఐదుగురిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ సంఘ ఐక్యతకు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ నెల 24, 25వ తేదీల్లో మందస మండలం హరిపురంలో నిర్వహించనున్న జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరీ పోటీ చేస్తున్నారని, ఆమెకు ఉపాధ్యాయులంతా తమ మద్దతు తెలిపాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంతో పంట దిగుబడి

వ్యవసాయశాఖ జెడి త్రినాథస్వామి

అవగాహన కల్పిస్తున్న జెడి త్రినాథస్వామి

ప్రజాశక్తి- లావేరు

రైతులు ప్రకృతి వ్యవసాయ విధానాన్ని పాటించి పంట దిగుబడులు సాధించాలని జెడి త్రినాథస్వామి అన్నారు. మండలంలోని బెజ్జిపురంలో యూత్ క్లబ్ ఆఫ్ బెజ్జిపురం ఆధ్వర్యాన మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ద్రావనాలు అందుబాటులో ఉంచేందుకు అమృత ప్రకృతి వ్యవసాయం వనురాలు కేంద్రం ద్వారా తయారు చేయువిధానాన్ని తెలియజేశారు. రసాయన ఎరువులకు బదులు గణజీవమృతం 500 కిలోలు, వంద లీటర్లు వీష ముష్టి కశయం, 200 లీటర్లు దశపరని ద్రావణం పైరు ఎదుగుదలకు, కోడిగుడ్లు నిమ్మరసం ద్రావణాన్ని తయారు చేసే విధానాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి రేవతి, వైసిబి అధ్యక్షుడు ఎం.ప్రసాదరావు, ఐసిటి ఎన్‌ఎఫ్‌ఎ శివకృష్ణ, గోవిందరెడ్డి, మాస్టర్ ట్రైనీ కృష్ణ, అప్పారావు, సోమశేఖర్, రాంబాబు, శివ పాల్గొన్నారు.

కష్టపడేవారికి గుర్తింపు

కవిటి: టిడిపిలో సామాన్య కార్యకర్త నుంచి నాయకుడు వరకు ఎవరైనా కష్టపడి పనిచేస్తే తగిన గుర్తింపు లభిస్తుందని, అందుకు బార్ల చినబాబు ఉదాహరణ అని టిడిపి నాయకులు పొందల కృష్ణారావు, బెందాళం విజయకృష్ణ అన్నారు. కళింగ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన బల్లిపుట్టుగకు చెందిన బార్ల చినబాబును టిడిపి నాయకులు మంగళవారం ఆయన నివాసం వద్ద కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న టిడిపి నాయకులు

భవిష్యత్‌లో మరిన్ని పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ బాల్లెడ శ్రీపతి, బల్లెద శ్రీను, తమరాల హరనాథ్, రుంకు సత్యం, పొందల ప్రసాద్, బొడ్డ మన్మథరావు, గున్న రామకృష్ణ, బెందాళం సాయి పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

సంతోష్ బిస్వాల్ మృతదేహం (ఇన్‌సెట్‌లో సంతోష్ బిస్వాల్ ఫైల్)

ట్రాక్టర్‌పై నుంచి జారిపడి యువకుడు మృతి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని పెద్దపద్మాపురం సమీపంలో మంగళవారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో గంగరాజపురానికి చెందిన సంతోష్ బిస్వాల్ (30) మృతి చెందాడు. ఏకాదశి సందర్భంగా గంగరాజుపురం నుంచి సుందరాడ ట్రాక్టర్‌పై ప్రయాణిస్తుండగా... పైనుంచి జారిపడటంతో తీవ్ర గాయాలకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి తల్లిదండ్రులు అర్జున్ బిస్వాల్, దమయంతి బిస్వాల్, ఇద్దరు అన్నయ్యలు, అక్క ఉన్నారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనాస్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ పి.రమేష్‌బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురికి గాయాలు

కోటబొమ్మాళి: మండలంలో మంచాలపేటకు చెందిన మంచాల చంద్రరావు, తన తమ్ముడు రాజగోపాలరావు, మరదలు సరోజనిలపై అదే గ్రామానికి చెందిన బాడాన చక్రధర్, మరికొంత మంది దాడి చేయటంతో ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చంద్రరావు కుమార్తెను కొంత కాలంగా చక్రధర్ ప్రేమించుకొని పెళ్లికి సిద్ధమయ్యారు. అయితే చక్రధర్ మంచివాడు కాదని, అటువంటి వాడితో పెళ్లివద్దుయని అమె తండ్రి నిరాకరించారు. అది మనస్సులో పెట్టుకొని అగ్రహంలో చక్రధర్ మరికొంత మంది చంద్రరావు ఇంటిపైకి దాడికి వెళ్లారు. అయితే దాడిని అడ్డుకున్న రాజగోపాల రావు, మరదలు సరోజనికీ గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ వి.సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విఆర్‌ఒకు...

మందస : పలాస మండలం నెమలి నారాయణపురం జాతీయ రహదారి వద్ద మంగళవారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో విఆర్‌ఒ గవరయ్య గాయపడ్డాడు. విధుల నిమిత్తం హరిపురం బైక్ వస్తుంగా... వేగాన్ని అదుపు చేయలేక బోల్తా పడడంతో గాయపడ్డాడు. వెంటనే హైవే సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని ఆస్పత్రికి తరలించారు.

ఇద్దరు అరెస్టు

పొందూరు: మండలంలోని కింతలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మరుగుదొడ్ల వాటర్ ట్యాప్‌లను చోరీ చేసిన ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు ఎస్ఐ వి.సత్యనారాయణ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కేసుకు సంబంధించి శ్రీకాకుళం పట్టణానికి చెందిన పొందూరు అప్పారావు, చింతలపూడి ప్రేమ్‌కుమార్‌లను అరెస్టు చేశామన్నారు. కళాశాలలో ఇటీవల చేపట్టిన నాడు-నేడు పనుల్లో భాగంగా మరుగుదొడ్లలో ఏర్పాటు చేసిన వాష్ బేసిన్ పగలగొట్టి 19 వాటర్ ట్యాప్‌లను చోరీ చేసినట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ జె.సునీత గత నెల 28న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టి వారిని అరెస్టు చేశామని తెలిపారు.

ఇసుక రవాణా బిల్లుల నిర్వాహకుడు...

ఆమదాలవలస : పట్టణంలోని వన్ వే జంక్షన్ వద్ద ఉన్న సాయి గౌరీశంకర్ ఇంటర్నెట్ సెంటర్ నిర్వాహకుడు మూకళ్ల హిమవంతరావును ఎస్ఐ కె.వెంకటేష్, శ్రీకాకుళం సైబర్ క్రైమ్ పోలీసులు మంగళవారం సంయుక్తంగా దాడులు చేసి అరెస్టు చేశారు. ఇంటర్నెట్ సెంటర్‌లో గత కొంత కాలంగా తప్పుడు ఇసుక లారీల రవాణా బిల్లులను తయారు చేస్తున్నారన్న సమాచారంపై దాడులు చేసి కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

పొందూరు : నిందితులను ప్రవేశపెట్టిన పోలీసులు

పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్, జెసి

నేటి నుంచి సహకార వారోత్సవాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కలెక్టరేట్‌లో అఖిల భారత సహకార వారోత్సవాల పోస్టర్‌ను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జెసి కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్‌లు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 20 వరకు నిర్వహించే ఈ వారోత్సవాల్లో సహకార చట్టాలు, సహకార సంస్థలు ప్రజలకు అందిస్తున్న సేవలపై విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. సహకార బ్యాంకుల ద్వారా ప్రధానంగా రైతులకు అందిస్తున్న సేవలు వివరించాలన్నారు. ప్రభుత్వ ఆలోచలను నెరవేర్చే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి బి.నగేష్, డిసిసిబి సిఇఒ వరప్రసాద్ పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- కవిటి

మందస మండలం హరిపురంలో ఈనెల 24, 25 తేదీల్లో నిర్వహించనున్న జిల్లా విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు లండ బాబురావు పిలుపునిచ్చారు. కవిటి మండల ఉపాధ్యాయులను స్థానిక ఎంఆర్‌సి కార్యాలయంలో మంగళవారం ఆయన కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావలసిన ఆర్థిక బకాయిలు, పిఆర్‌సి, డిఎ గురించి బడ్జెట్‌లో కేటాయించకపోవడంతో దురదృష్టకరమని అన్నారు. ఈ సమస్యలన్నింటిపై చర్చించి రాష్ట్ర ప్రభుత్వానికి ఒక నివేదిక ఇవ్వడానికి అందరూ సిద్ధం కావాలని కోరారు. జిల్లా కార్యదర్శి మురళి ప్రకాష్ మాట్లాడుతూ ఉద్యమ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరిని గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీష్, సీతంనాయుడు, త్రినాథ్‌నాయుడు, జానకిరావు, మనోజ్, సూర్యం, శ్రీధర్, సందీప్ పాల్గొన్నారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న అధ్యాపకులు

చాందినికి అభినందనలు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బైపిసి విద్యనభ్యసించి రిలీవ్ అయిన విద్యార్థి గొండు చాందినికి బాపట్లలోని అగ్రికల్చర్ బిఎస్‌సిలో సీటు లభించిందనీ ప్రిన్సిపాల్ ఎం.నాగేంద్ర తెలిపారు. మండలంలోని గోనెపాడుకు గొండు శ్రీనివాసరావు, వేణమ్మ దంపతుల కుమార్తె చాందినికి బాపట్లలోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో అగ్రికల్చర్ బిఎస్‌సిలో సీటు లభించిందన్నారు. ఈ ఏడాది సరుబుజ్జిలి ప్రభుత్వ కళాశాలలో బైపిసి చదివిన చాందిని 951 మార్కులతో ఉత్తీర్ణత పొందన్నారు. ఎంసెట్‌లో 13,027 ర్యాంకు సాధించిందన్నారు. ఆమె సీట సాధించడంపై అధ్యాపకులు రమేష్ సాహూ, విజయకుమార్, వినోద్ రాజు, గౌతమి అభినందించారు. గతేడాది కాంపిటీటివ్ సెల్ నిర్వహించిన పూర్వ అధ్యాపకులు గణపతి ధనుంజయరావు, చిన్నారావు, లైబ్రేరియన్ ఆకెళ్ల రామారావు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం పూర్వ అధికారి దుగ్గివలస రాంప్రసాద్ సహకారంతో తాను పోటీ పరీక్షల్లో రాణించానని చాందిని తెలిపింది.

ధ్రువపత్రం అందజేస్తున్న అధికారులు

మత్స్యకారుల సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- పోలాకి

మండలంలోని రాజారాంపురంలో సాగర మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు మంగళవారం నిర్వహించామని, ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నామని నిర్వాహకులు ఎస్.ముసలనాయిడు, శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షునిగా కోడ తాతారావు, ఉపాధ్యక్షునిగా ఎం.వాసుదేవరావు, కార్యదర్శిగా కె.సాయికుమార్, డైరెక్టర్లుగా జి.యర్రయ్య, పి.ముసలయ్య, ఎస్.రాంబాబు, డి.తవిటియ్య, జి.గురుమూర్తి, కె.నూకరాజులను ఎన్నుకున్నామని తెలిపారు. అనంతరం ఎన్నికైన దవపత్రాలు, రికార్డులు సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎం.త్రినాథరావు, ఎస్.వెంకునాయిడు, అప్పలరెడ్డి, గిరిధర్, కె.యర్రయ్య, లక్ష్మీపతి, అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న గిరిబాబు

గిరిబాబు పరామర్శ

కోటబొమ్మాళి: కోటబొమ్మాళికి చెందిన విలేకరి టి.వి.రమణ భార్య తలగాపు ఝాన్సీ కిడ్నీ వ్యాధితో ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న పలాస-కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు మృతురాలి కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించారు. ముందుగా ఝాన్సీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సవర సోమేష్, వల్లభ వైకుంఠరావు, బడగల మధు, డబ్బీరు నాగు పాల్గొన్నారు.

రబీపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని గొప్పలి, గోకర్ణపురం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పలాస వ్యవసాయ సహాయ సంచాలకులు ఎల్.వి.మధుబాబు పాల్గొని రైతులకు రబిలో పండించే పంటలపైన అవగాహన కల్పించారు. వేరుశనగ పండించే రైతులు విధిగా విత్తన శుద్ధి చేసుకోవాలని తెలియజేశారు. విత్తన శుద్ధి చేసుకోవడంతో వేరుశనగను ఆశించే వేరుకుళ్లు తెగులు నుంచి రక్షించుకోవచ్చు అని తెలిపారు. అలాగే వేరుశనగ పంటలో సింగిల్ సూపర్ ఫాస్పేట్, జిప్సం ఎరువులను

మెళియాపుట్టి : వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న మధుబాబు

తప్పకుండా వాడాలని సూచించారు. ఇది వాడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చునని తెలియజేశారు. అలాగే మినుము, పెసర పంటలలో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు తెలియజేశారు. రబీలో పండించే వేరుశనగ, మినుము, పెసర పంటలకు పంటల బీమా ప్రీమియం నేరుగా రైతులు చెల్లించుకుని పంటల బీమా పొందే సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించిందని తెలియజేశారు. అనంతరం రైతులకు వేరుశనగ, మినుము విత్తనాలను రాయితీపై పంపిణీ చేశారు. వ్యవసాయ అధికారి దానకర్షుడు, సర్పంచ్ రవికుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు పావని, వాసు పాల్గొన్నారు.

కవిటి: రబీ పంటపై ప్రత్యేక దృష్టి సారించి రాగి, పెసర, మినుము పంటలు సాగు చేయాలని మండల ఎఒ బడగల దుర్గాప్రసాద్ సూచించారు. మండలంలోని నెలవంకలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేలైన పద్ధతులు పాటించడం ద్వారా రబీలో మంచి దిగుబడులు సాధించవచ్చని సూచించారు. వరి పంట పరిశీలించి తీసుకోవలసిన జాగ్రత్తలు సూచించారు. కార్యక్రమంలో విఎఎ పూడి సాయికుమార్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

చేనేత మంత్రిని కలిసిన ఎమ్మెల్యే

పాతపట్నం : విజయవాడలో రాష్ట్ర సంక్షేమ, చేనేత, జౌళిశాఖ మంత్రి సవితని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కలిశారు. ఆమె క్యాంప్ కార్యాలయంలో మంగళవారం కలిసి నియోజకవర్గంలోని చేనేత కార్మికుల సమస్యలను వివరించారు. కార్మికుల సమస్యలను పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

రేపట్నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

సంతబొమ్మాళి : సంతబొమ్మాళి శాఖాగ్రంథాలయ ఆధ్వర్యాన ఈ నెల 14 నుంచి 20 వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయాధికారి రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రీడర్లు, స్థానిక ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పరిశీలిస్తున్న జయరాజ్

పశుగణన సర్వే పరిశీలన

ప్రజాశక్తి- కంచిలి

మండలంలోని జాడుపూడి, దాకరాపల్లి గ్రామాల్లో మంగళవారం నిర్వహిస్తున్న 21వ అఖిలభారత పశు గణనను టెక్కలి పశుసంవర్ధకశాఖ ఉపసంచాలకులు పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఇప్పటివరకు 15 గ్రామాల్లో సర్వే పూర్తయిందన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి పశుగణన పూర్తవుతుందన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి డాక్టర్ వి.జయరాజ్, రాజేష్, రబియా పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

సిసి రోడ్డు పనులు పరిశీలన

వజ్రపుకొత్తూరు: గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని టిడిపి మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు అన్నారు. మండలంలోని పల్లివూరు పంచాయతీ హుకుంపేటలో సిసి రోడ్డు పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 38 పంచాయతీల్లో ఉపాధి హామీ నిధులతో సిసి రోడ్డు పనులు చేపడుతున్నట్లు వివరించారు. పల్లె పండగలో మంజూరైన అన్ని పనులు వచ్చే ఏడాది జనవరి నాటికి పూర్తవుతాయని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అరసవెల్లి ఉమామహేశ్వరరావు, వంక రామరావు, సూరాడ మాధవరావు పాల్గొనారు.

బోరుకు శంకుస్థాపన

నౌపడ : సంతబొమ్మాళి మండలం మరువాడ పంచాయతీలో దేవాలయాల వద్ద తాగునీటి బోర్ల ఏర్పాటుకు సర్పంచ్ ప్రతినిధి స్వరాలు దాసురాజు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తీర ప్రాంతాలకు సురక్షిత తాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మెరుగు నూకయ్య, గ్రామస్తులు సూరడ కృష్ణమూర్తి, సూరాడ నిరాకరి, వీరభక్తులు, మేరుగు నరసింహులు, చొక్కర కష్ణ, గంటలోకేష్, గోవింద, కృష్ణ పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న దాసురాజు

ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వ మద్యం షాపుల్లో పనిచేసిన సేల్స్‌మెన్లు, సూపర్‌వైజర్లను విధుల్లోకి తీసుకొని, ఉద్యోగభద్రత కల్పించాలని ఎఐటియుసి నాయకులు కొన్న శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. నగరంలోని క్రాంతి భవన్‌లో సేల్స్‌మెన్ సూపర్‌వైజర్ల సంఘం సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ ంసదర్భంగా మాట్లాడుతూ బకాయి పడిన వేతనాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలన్నారు. గత ప్రభుత్వం రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ ఆధ్వర్యాన అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన ప్రభుత్వ మద్యం షాపుల్లో ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాల్లోకి తీసుకున్నారని అన్నారు. ప్రభుత్వం మారిన తర్వాత మారిన మద్యం విధానం వల్ల సేల్‌మెన్లు, సూపర్‌వైజర్లు ఉపాధిని కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయం చూపకుండా అర్థాంతరంగా

అభివాదం చేస్తున్న సంఘ నాయకులు

తొలగించడం వల్ల వారి కుటుంబాలను రోడ్డున పడేసి ఉపాధి లేకుండా చేశారని విమర్శించారు. అలాగే బకాయిపడిన వేతనాలు, బోనస్‌లను చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా బొత్స సంతోష్, కార్యదర్శిగా టి.కిశోర్, ఉపాధ్యక్షులుగా పి.కిరణ్‌కుమార్, టి.రాజా, సహాయ కార్యదర్శులుగా కె.శ్రీను, అనిల్, కోశాధికారిగా కె.రామోజీరావులు ఎన్నికయ్యారు.

ఇచ్ఛాపురం : ఆర్థికసాయం అందజేస్తున్న దాతలు

పలువురు ఆర్థికసాయం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని పెద్దబొడ్డపాడు పంచాయతీ సీతాపురానికి చెందిన తమ్మినాన సుస్మిత ఉన్నత చదువు కోసం గ్రామ యువకులు మంగళవారం రూ.23 వేల విలువ గల బ్యాంకు బాండ్లను అందజేశారు. సుస్మిత తండ్రి తమ్మినాన రాజారావు కొన్ని నెలల క్రితం కిడ్నీ వ్యాధితో మృతి చెందారు. అయితే ఇంటికి పెద్ద దిక్కు కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు పడుతున్న మృతుని కుటుంబానికి అండగా నిలిచేందుకు కాళీమాత వాట్సాప్ గ్రూప్ వేదికగా విరాళాలు సేకరించింది. అనంతరం కుటుంబానికి అందజేసి అండగా నిలిచారు. కంచిలి మోడల స్కూల్‌లో ఇంటర్ చదువుతున్న సుస్మిత రానున్న రోజుల్లో ఉన్నత లక్ష్యాలను అధిరోహించాలని వారు ఆకింక్షించారు. కార్యక్రమంలో సభ్యులు హనుమంతు శివకుమార్, హెచ్.అప్పలస్వామి, కె.చలపతిరావు, రేవతి పాల్గొన్నారు.

ఇచ్ఛాపరం : మండలంలోని డొంకూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న దున్న సమీర పక్షవాతానికి గురై రెండు కాళ్లు, చేతులు చచ్చిబడిపోయాయి. బాధితురాలి వైద్య ఖర్చుల కోసం దాతలు ముందుకొచ్చి ఆర్థికసాయం అందజేశారు. 2018 తెలుగు పండిత సేవా సదన్ స్పందించి రూ.5 వేలు, పాఠశాల ఉపాధ్యాయులు రూ.5 వేలు, విద్యార్థులు రూ.5 వేలు చొప్పున మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.కళ్యాణిబాబు, పాఠశాల చైర్మన్ కె.జానకిరావు, హెచ్‌ఎం జె.సరోజని, గోవిందరావు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తం

ప్రజాశక్తి- పాతపట్నం

ఆన్‌లైన్ మోసాలపై విద్యార్థులు విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ బి.లావణ్య అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంకల్ప్, సైబర్ నేరాలు, మత్తు పదార్థాలపై అవగాహనా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. డ్రగ్స్, మత్తు పదార్థాలు సేవించడం వల్ల వచ్చే ఆరోగ్య పరమైన రోగాలపై వివరించారు. మీ గ్రామాల పరిధిలో మత్తు పదార్థాలు విక్రయాలు చేపట్టినా, సైబర్, ఆన్‌లైన్ మోసాలు జరిగితే వెంటనే హెల్ప్‌లైన్, పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపక, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పాతపట్నం : అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ లావణ్య

పోలాకి : ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు బెలమర కూడలి వద్ద ఎస్‌ఐ జి.రంజిత్ సైబర్ నేరాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై వివరించారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.

ఆమదాలవలస : మత్తు పదార్థాలకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్‌ఐ కె.వెంకటేష్ అన్నారు. పట్టణంలోని 13వ వార్డు ఐ.జె. నాయుడు కాలనీలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

మాట్లాడుతున్న మీనాక్షి

బాలికల రక్షణపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి- కవిటి

బాలబాలికల రక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని మిషన్ వాత్సల్య జిల్లా బాలల రక్షణ విభాగం సోషల్ వర్కర్ బి.మధుర మీనాక్షి సూచించారు. కవిటి మహిళా సమాఖ్య భవనంలో మండలంలోని గ్రామైక్య సంఘ అధ్యక్షులు, వెలుగు కార్యాలయ సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్యవివాహాల నిషేధానికి 11 నుంచి 18 సంవత్సరాల మధ్యనున్న బాలికలను సంఘాలుగా ఏర్పాటు చేసి వారి హక్కులు, విధులు కాపాడుకోవడానికి తీసుకోవలసిన చర్యలు వివరించాలని సూచించారు. దత్తత, అనధికార దత్తత వల్ల జరిగే నష్టాలు, ప్రభుత్వ అనుమతి లేకుండా బాల బాలికలతో హాస్టల్స్ నిర్వహించే వారిపై తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఎపిఎం గోవిందరావు, వెలుగు కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

బిఎస్‌ఎన్‌ఎల్ నిర్వీర్యానికి కుట్ర

పర్లాకిమిడి : కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చిన పదేళ్లలో భారతీయ సమాచార నిగమ్ లిమిటెడ్ అందిస్తున్న సేవలు పూర్తిగా నిర్వీర్యానికి చర్యలు తీసుకుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. గజపతి జిల్లా కాశీనగర్ పట్టణం, కాశీనగర్ సమితిలోని అన్ని గ్రామాల్లో బిఎస్‌ఎన్‌ఎల్ అందిస్తున్న సేవలే అందుకు నిదర్శనం. ఇక్కడ బిఎస్‌ఎన్‌ఎల్. సేవలు కనిపించవు, వినిపించదు చందంగా మారిందని స్థానికులు చలోక్తులు విసురుతున్నారు. బిఎస్‌ఎన్‌ఎల్ టవర్‌పై మొలిచిన మొక్కలే స్థానిక సేవల నాణ్యతను తెలియజేస్తుందని స్థానికులు పెదవులు విరుస్తున్నారు. ప్రయివేటు నెట్‌వర్క్ ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో చాలామంది వినియోగదారులు బిఎస్‌ఎన్‌ఎల్‌లోకి మారారు. బిఎస్‌ఎన్‌ఎల్ అభివృద్ధి చేసి 5జి సేవలు అందిస్తామని చెప్పి మూడు, నాలుగు నెలలు అయినా... సాధారణ సేవలు కూడా ఇవ్వకపోవడం చాలా ఘోరమని స్థానికులు విమర్శిస్తున్నారు. బిఎస్‌ఎన్‌ఎల్ సేవలు ఎప్పుడూ సంపూర్ణంగా అందించడం లేదని, ఎప్పుడైనా విద్యుత్ సరఫరా నిలిచిపోతే సేవలు పూర్తిగా శూన్యమని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రయివేటు నెట్‌వర్క్ ధరలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అదుపు చేయడంలో విఫలమయ్యాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా బిఎస్‌ఎన్‌ఎల్ సేవలను మెరుగుపర్చాలని కోరుతున్నారు.

అధికారులతో మాట్లాడుతున్న చినబాబు

15న 'బిర్సాముండా' జయంతి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ఈ నెల 15న గిరిజన స్వాతంత్ర సమరయోధుడు బిర్సాముండా జయంతిని పురస్కరించుకుని జనజాతీయ గౌరవ దివస్ కార్యక్రమాన్ని మెళియాపుట్టిలో నిర్వహిస్తున్నట్లు ఐటిడిగా ఎపిఒ జి.చిన్నబాబు తెలిపారు. దీనిలో భాగంగా మెళియాపుట్టిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో మంగళవారం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. వివిధ శాఖల స్టాల్స్ పెట్టడానికి ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రధానమంత్రి వర్చువల్‌గా మాట్లాడే అవకాశం ఉన్నందున అందుకు సంబంధించిన నెట్‌వర్క్ ఏర్పాట్లను చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిఇ సిమ్మన్న, ఎఇ శ్రీకాంత్, ఐటిడిఎ పిహెచ్‌ఒ గణేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సహదేవ్‌రెడ్డి

భూ సర్వేలో తప్పులు సరిదిద్దాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

సమగ్ర భూ సర్వేలో నెలకున్న తప్పులను సరిదిద్దాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శాడి సహదేవ్‌రెడ్డి అధికారులను కోరారు. మండలంలోని కొఠారి పంచాయతీలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పూర్ణాటకం రెవెన్యూ గ్రామంలో గత ప్రభుత్వ హయంలో చేసిన భూ రీ సర్వేలో నంబర్ల మధ్య వ్యత్యాసం కనిపిస్తుందని అన్నారు. రెండు పర్యాయాలు సర్వేలు చేసినా మార్పు రాలేదన్నారు. సర్వేలో ఒక నంబరుకు మరొక నంబరుకు పోలిక లేదన్నారు. ఆ గ్రామంలో 96 ఎకరాలు మాత్రమే భూమి ఉందని పేర్కొన్నారు. అధికార యంత్రాంగం మరోసారి తప్పులు లేకుండా సరిదిద్దాలని కోరారు.

సభ్యత్వాన్ని అందజేస్తున్న అరుణ్‌కుమార్

సభ్యత్వ నమోదు వేగవంతం

ప్రజాశక్తి- కొత్తూరు

ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆదేశాల మేరకు కొత్తూరులో టిడిపి సభ్యత్వ నమోదు మంగళవారం చేపట్టామని టిడిపి నాయకులు అగతముడి అరుణ్ కుమార్ తెలిపారు. సభ్యత్వానికి కార్యకర్తలు రూ.వంద చెల్లించారని, వారికి రసీదులు అందజేశామని అన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి ప్రతినిధి తిరుపతిరావు, నాయకులు ముగితి కృష్ణారావు, చోడవరపు రాము, చోడవరపు వెంకటరమణ, చోడవరపు జోగినాయుడు, పాలవలస గోవిందరావు, ఆశపు గణేష్‌లు పాల్గొన్నారు.

'ఉల్లాస్'పై అవగాహన

మందస : స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం ఉల్లాస్‌పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి ప్రతి గ్రామం నుంచి డ్వాక్రా విఒఎస్, విఒలు ద్వారా వాలంటీర్లను నియమించి ఈ మేరకు వారికి శిక్షణా కార్యక్రమం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సూర్యనారాయణ, సెర్ప్ ఎపిఎం కూర్మారావు, ఎంఇఒలు లక్ష్మణరావు, భాస్కరరావు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎల్లంనాయుడు

రూ.85 లక్షలతో 'ఉపాధి' పనులు

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని వెంకటాపురంలో 2025-26 ఆర్థిక సవత్సరానికి రూ.85 లక్షలతో 34 పనులు గుర్తించామని సర్పంచ్ సర్పంచ్ బొంతు అరుణ, ప్రతినిధి ఎల్లంనాయుడు అన్నారు. మండలంలో వెంకటాపురంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాబ్‌కార్డుదారులందరూ ఉపాధి పనులను సద్వినియోగం చేసుకుని గ్రామాభివృద్ధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి మడ్డి రమణ, నాయకులు శంభాన రమేష్, ఎం.త్రినాథ్, ఉప సర్పంచ్ సేనపతి రామారావు, అదపాక తాతారావు పాల్గొన్నారు.